# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 07 | మంగళవారం | 4-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:07 | Tuesday | 4-8-2026 | Pages:08 | Cost:2/- |







## టీఎంసీకి సుభాష్ చంద్రబోస్ మనవడి రాజీనామా

వ్యక్తిగత కారణాలతోనే పార్టీ వీడుతున్నట్లు వెల్లడి

2026 అసెంబ్లీ ఎన్నికల ముందు టీఎంసీలో చేరిన బోస్

గతంలో బీజేపీకి రాజీనామా చేసి తృణమూల్‌లో చేరిన వైనం



2లో

## మిస్టర్ డ్రామారావు" అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

- పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఆరోపణ
- పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించారని విమర్శ
- అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య



## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కేసులో కొత్త ట్విస్ట్.. మరో మహిళతోనూ సంబంధం.. దర్యాప్తులో సంచలన నిజాలు!



తోటి ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణిపై వేధింపుల కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి సంబంధించి దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నగర మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ నేతృత్వంలో సాగుతున్న విచారణలో నిందితుడి విపరీత ప్రవర్తన, ఇతర సంబంధాలపై కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. కేసులో భాగంగా సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం పోలీసులు అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌తో పాటు ఒక కత్తి, వేర్వేరు చేతిరాతలతో ఉన్న రెండు ప్రేమలేఖలను స్వాధీనం చేసుకున్నారు.

# ఉద్యమ స్ఫూర్తి కోసం ఎటో చూడక్కరలేదు



- బంగ్లాదేశ్, నేపాల్‌లతో పని లేదు
- మనకు మహాత్ముడు ఉన్నాడు
- జెన్ జీ ఉద్యమంపై సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే వ్యాఖ్య
- పీటీఐకి ప్రత్యేక ఇంటర్వ్యూ

ఛత్రపతి శంభాజీనగర్: విద్యార్థి లోకం ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లేందుకు తగిన స్ఫూర్తి కోసం బంగ్లాదేశ్, నేపాల్ వంటి పొరుగుదేశాల వైపు చూడాల్సిన అగత్యంలేదని, మనకు మహాత్మాగాంధీ ఉన్నారని కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు. సోమవారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో పీటీఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో దీప్కే పలు అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. "ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మహాత్మాగాంధీ నుంచి స్ఫూర్తి కణికలు దేశ నలుచెరుగులా ఎగసిపడుతుండగా మళ్లీ ఉద్యమస్ఫూర్తి కోసం విదేశాల వైపు చూడాల్సిన

- మిగతా 2వ పేజీలో



2లో

## బ్రిజ్ భూషణ్‌కు భారీ ఊరట

లైంగిక ఆరోపణల కేసులో నిర్దోషిగా తేల్చిన ఢిల్లీ కోర్టు

సాక్ష్యాలు లేవని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: మహిళ రెజ్లర్లపై లైంగిక ఆరోపణలకు పాల్పడ్డారన్న ఆరోపణల నుంచి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్‌భూషణ శరణ్ సింగ్‌కు సోమవారం భారీ ఊరట లభించింది. సాక్ష్యాలు లేని కారణంగా ప్రపంచ ఛాంపియన్ వినేశ్ ఫొగాట్‌సహా ఆరుగురు రెజ్లర్లు బ్రిజ్‌భూషణ్‌పై వేసిన కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి అశ్విని పన్వర్ తీర్పునిచ్చారు బ్రిజ్‌భూషణ్ సింగ్‌తోపాటు రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌నూ నిర్దోషిగా ప్రకటించారు.

- మిగతా 2వ పేజీలో

## రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు
- ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై సమీక్ష
- రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించి, సేవలు సులభతరం చేయాలని సూచన
- పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశం
- వివిధ శాఖల పనితీరుపై ఆర్టీజీఎస్‌లో ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ



రవాణా శాఖలో అనవసర నిబంధనలను తక్షణమే తొలగించాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించి ప్రజలకు సులభతరమైన, అవినీతి రహిత సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై సీఎం కీలక సూచనలు చేశారు. రవాణా శాఖలో సంస్కరణలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు, ఫారం-5బీ వంటి పరీక్షల తొలగింపు ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా చూడవచ్చని తెలిపారు. ఈ చర్యలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

- మిగతా 2వ పేజీలో

### కోర్టులో లొంగిపోయిన తమ్మినేని కుమారుడు..

## బెయిల్ మంజూరు

- భూకబ్జా కేసులో కోర్టులో లొంగిపోయిన తమ్మినేని కుమారుడు చిరంజీవి నాగ్
- ఆరోగ్య కారణాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేసిన శ్రీకాకుళం కోర్టు
- ఈ కేసులో ఏ5గా చిరంజీవి, ఏ6గా తమ్మినేని సీతారాం, ఏ7గా ఆయన భార్య వాణిశ్రీ
- ఈ నెల 10వ తేదీన విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశం

శ్రీకాకుళం జిల్లా చాపరం భూకబ్జా కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ స్పీకర్, వైసీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుమారుడు వెంకట చిరంజీవి నాగ్ సోమవారం శ్రీకాకుళం కోర్టులో లొంగిపోయారు. విచారణ సందర్భంగా ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది.



2లో



2లో

## పొగాకు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేయూత

- రైతుకు రూ. 50,000 వడ్డీలేని రుణం ప్రకటించిన కేంద్రం
- లో, ఆఫ్-స్టైల్ రకాలకు కేజీకి రూ. 10 రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకం
- వివిధ రకాల పొగాకుకు కనీస కొనుగోలు ధరల ఖరారు

పొగాకు రైతులకు ఊరటనిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాయి. ఈ వివరాలను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు 45,000 మంది రైతులకు

### ట్రంప్ సుంకాలపై తిరుగుబాటు..

## ట్రంప్ సర్కారుపై 25 రాష్ట్రాల దావా

- 60 దేశాలపై ట్రంప్ ప్రభుత్వం విధించిన సుంకాలను వ్యతిరేకిస్తున్న రాష్ట్రాలు
- ఇవి చట్టవిరుద్ధమంటూ అమెరికా అంతర్జాతీయ వాణిజ్య కోర్టులో దావా
- భారత్ సహా పలు దేశాలపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు టారిఫ్‌లు
- ఈ సుంకాల వల్ల వినియోగదారులు, వ్యాపారాలపై భారం పడుతుందన్న రాష్ట్రాలు





### పీకే వ్యూహం ఫలించింది..

## బాంకీపూర్ ఉపఎన్నికలో బీజేపీ చిత్తు

- బంకీపూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో ప్రశాంత్ కిశోర్ ఘన విజయం
- బీజేపీ అభ్యర్థిపై సుమారు 19,000 ఓట్ల ఆధిక్యంతో గెలుపు
- 1995 నుంచి బీజేపీ చేతిలో ఉన్న స్థానాన్ని కైవసం చేసుకున్న జన సురాజ్ పార్టీ
- ఎన్నికల బరిలో పీకేకు, ఆయన పార్టీకి ఇదే తొలి విజయం
- స్థానిక సమస్యలు, యువత అసంతృప్తే గెలుపునకు కారణమని విశ్లేషణ

పట్నా: బిహార్ రాజకీయాల్లో సంచలనం నమోదైంది. సుమారు మూడు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీకి కంచుకోటగా ఉన్న బాంకీపూర్ అసెంబ్లీ స్థానం చేజారింది. సోమవారం వెలువడిన ఉపఎన్నిక ఫలితాల్లో జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) చారిత్రక విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై ఆయన సుమారు 19,324 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

- మిగతా 2వ పేజీలో

# కోర్టులో లొంగిపోయిన తమ్మినేని కుమారుడు.. బెయిల్ మంజూరు

భూ కబ్జా ఆరోపణలకు సంబంధించిన కేసులో చిరంజీవి నాగ్‌ను ఏ5 (5వ నిందితుడు)గా చేర్చారు. ఈ క్రమంలో సోమవారం ఆయన కోర్టు ఎదుట హాజరయ్యారు. విచారణ సమయంలో, తన ఆరోగ్య పరిస్థితిని చిరంజీవి నాగ్ కోర్టుకు వివరించారు. ఆయన వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అనంతరం, ఈ నెల 10వ తేదీన జరిగే తదుపరి విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని చిరంజీవి నాగ్‌ను కోర్టు ఆదేశించింది. ఇదే కేసులో చిరంజీవి నాగ్ తండ్రి తమ్మినేని సీతారాం ఏ6 (6వ నిందితుడు)గా, ఆయన తల్లి వాణిశ్రీ ఏ7 (7వ నిందితురాలు)గా ఉన్నారు. ఒకే కేసులో మాజీ స్పీకర్ కుటుంబ సభ్యులు ముగ్గురూ నిందితులుగా ఉండటం గమనార్హం.

## టీఎంసీకి సుభాష్ చంద్రబోస్ మనవడి రాజీనామా

నేతాజీ సుభాష్ చంద్రబోస్ మనవడు చంద్రకుమార్ బోస్ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన సోమవారం ప్రకటించారు. ఈ అనూహ్య పరిణామంపై టీఎంసీ అధిష్ఠానం స్పందించాల్సి ఉంది. చంద్రకుమార్ బోస్ రాజకీయ ప్రస్థానం గత కొంతకాలంగా చర్చనీయాంశంగా మారింది. 2016లో ఆయన బీజేపీలో చేరారు. ఆ పార్టీ తరఫున 2016 అసెంబ్లీ ఎన్నికల్లో, 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలయ్యారు. పశ్చిమ బెంగాల్ బీజేపీ ఉపాధ్యక్షుడిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించారు. అయితే, నేతాజీ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లడంలో బీజేపీ విఫలమైందని ఆరోపిస్తూ 2023లో ఆ పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం, 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆయన తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అయితే, టీఎంసీలో చేరిన కొద్ది కాలానికే పార్టీని వీడటం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. బీజేపీ తర్వాత టీఎంసీకి కూడా ఆయన స్వస్తి పలకడంతో, బోస్ తదుపరి రాజకీయ అడుగులు ఎటువైపు ఉంటాయనే దానిపై సర్వత్రా చర్చ మొదలైంది.

# రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

దశలవారీగా ఈ సంస్కరణలను అమలు చేసేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, వీలైనంత త్వరగా అనవసర నిబంధనలను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేని వ్యవస్థను రూపొందించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై కూడా సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నందున కృష్ణా బేసిన్‌లోకి నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. వర్షాభావం కారణంగా భవిష్యత్తులో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీనికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పీకే వ్యూహం ఫలించింది.. బాంకీపూర్ ఉపఎన్నికలో బీజేపీ చిత్తు

ఈ విజయంతో జన్ సురాజ్ పార్టీ తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టగా, ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్‌కు ఇదే తొలి గెలుపు కావడం విశేషం. ఈ ఎన్నికలో ప్రశాంత్ కిశోర్‌కు 64,151 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌కు 44,827 ఓట్లు పోలయ్యాయి. రాష్ట్రీయ జనతా దళ్ (=జేఐ) అభ్యర్థి రేఖా కుమారి 14,273 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. కేవలం 34.3 శాతం మాత్రమే పోలింగ్ నమోదైనప్పటికీ, ఫలితం బీజేపీకి తీవ్ర నిరాశను మిగిల్చింది. 1995 నుంచి బాంకీపూర్ (గతంలో పట్నా వెస్ట్) బీజేపీకి అత్యంత సురక్షితమైన స్థానం. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన నితిన్ నబిన్ ఈ స్థానం నుంచి వరుసగా ఐదుసార్లు గెలిచారు. ఆయన రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైంది. 2025 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నితిన్ నబిన్ ఏకంగా 51,000 ఓట్ల మెజారిటీతో, 62 శాతానికి పైగా ఓట్ షేర్‌తో గెలిచారు. కానీ, తాజా ఉపఎన్నికలో బీజేపీ ఓట్ షేర్ 34 శాతానికి పడిపోవడం గమనార్హం. ఈ ఓటమికి అనేక కారణాలు దోహదం చేశాయి. ముఖ్యంగా అభ్యర్థి ఎంపికలో బీజేపీ చేసిన తప్పిదం ప్రధానంగా కనిపిస్తోంది. మొదట అభిషేక్ కుమార్ సిన్హాను అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ, ఆయన తల్లిదండ్రులు దాణా కుంభకోణంలో దోషులుగా తేలారనే వార్తల నేపథ్యంలో ఆయన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. చివరి నిమిషంలో యువమోర్చా నేత నీరజ్ కుమార్ సిన్హాను బరిలోకి దించారు. ఈ ఆకస్మిక మార్పు ఓటర్లలో గందరగోళం సృష్టించడమే కాకుండా, ప్రచారానికి కొత్త అభ్యర్థికి తగినంత సమయం లేకుండా పోయింది. ఈ అవకాశాన్ని ప్రశాంత్ కిశోర్ చక్కగా వినియోగించుకున్నారు. 2025 ఎన్నికల్లో కేవలం అభ్యర్థులను నిలబెట్టి విఫలమైన ఆయన, ఈసారి స్వయంగా బరిలోకి దిగారు. స్థానిక సమస్యలు, యువత, నిరుద్యోగం, పాలనాపరమైన అంశాలను ప్రస్తావిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయన వ్యూహం ఫలించి బీజేపీకి సాంప్రదాయకంగా మద్దతిచ్చే అగ్రవర్ణ ఓట్లతో పాటు యాదవ్, ముస్లిం, దళిత, ఇతర వెనుకబడిన వర్గాల ఓట్లను గణనీయంగా సాధించారు. ఉపఎన్నికకు ముందు రాష్ట్రంలో నెలకొన్న కొన్ని సంఘటనలు కూడా బీజేపీపై వ్యతిరేకతను పెంచాయి. నీట్ వంటి పరీక్షల అవకతవకలపై విద్యార్థుల నిరసనలు, వారిపై పోలీసుల చర్యలు తీవ్ర ప్రభావం చూపాయి. జూన్ 2026లో భోజ్‌పూర్ జిల్లాలో విద్యార్థి నేత భరత్ భూషణ్ తివారీని పోలీసులు ఎన్‌కౌంటర్‌లో చంపడం రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలను రేపింది. ఈ ఘటన సొంత పార్టీ కేడర్‌లోనూ నిరుత్సాహాన్ని నింపినట్లు తెలుస్తోంది.

# ట్రంప్ సుంకాలపై తిరుగుబాటు.. ట్రంప్ సర్కార్‌పై 25 రాష్ట్రాల దావా



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న మరో కీలక నిర్ణయం న్యాయపరమైన చిక్కుల్లో పడింది. అమెరికా దిగుమతుల్లో 99.4 శాతం వాటా ఉన్న 60 దేశాలపై కొత్తగా విధించిన సుంకాలను సవాల్ చేస్తూ 25 డెమోక్రటిక్ రాష్ట్రాల కూటమి కోర్టును ఆశ్రయించింది. ఈ సుంకాలు చట్టవిరుద్ధమని, వీటివల్ల దేశవ్యాప్తంగా వినియోగదారులు, వ్యాపారాలపై తీవ్ర భారం పడుతుందని వాదిస్తూ అమెరికా అంతర్జాతీయ వాణిజ్య కోర్టులో దావా వేసింది. గత నెలలో ట్రంప్ ప్రభుత్వం 60 దేశాలపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు కొత్త సుంకాలను విధించింది. బలవంతపు కార్మిక వ్యవస్థను అరికట్టడంలో ఈ దేశాలు విఫలమయ్యాయన్న కారణంతో ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపింది. భారత్‌పై తొలుత 12.5 శాతం సుంకం ప్రతిపాదించినప్పటికీ, తర్వాత దానిని 10 శాతానికి తగ్గించారు. మరో 16 దేశాలతో పాటు భారత్ ఈ 10 శాతం టారిఫ్ పరిధిలోకి వస్తుంది. న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిషియా జేమ్స్, గవర్నర్ క్యాథీ హోచుల్ నేతృత్వంలోని ఈ కూటమి సోమవారం కేసు దాఖలు చేసింది. ఈ సందర్భంగా లెటిషియా జేమ్స్ మాట్లాడుతూ, "సుప్రీంకోర్టులో ఓటమి చవిచూసిన తర్వాత, ట్రంప్ ప్రభుత్వం మరోసారి కొత్త సుంకాలతో కుటుంబాలు, వ్యాపారాలపై అక్రమంగా పన్నులు పెంచడానికి ప్రయత్నిస్తోంది" అని విమర్శించారు. బలవంతపు కార్మిక వ్యవస్థను ఎదుర్కోవడానికి 'ట్రేడ్ యాక్ట్ 1974'లోని సెక్షన్ 301ను ఉపయోగిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఇది కేవలం పన్నులు విధించడానికేనని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బొంటా మాట్లాడుతూ "సుంకాలు అంటే పన్నులే. అధ్యక్షుడి విఫలమైన, చట్టవిరుద్ధమైన ఆర్థిక విధానాల వల్ల వచ్చే అదనపు ఖర్చులను అమెరికా ప్రజలు భరించలేరు" అని అన్నారు. బలవంతపు కార్మికులతో తయారు చేయించిన కేవలం మూడు ఉత్పత్తులను సాకుగా చూపి, డజన్ల కొద్దీ దేశాలపై సుంకాలు విధించడం ఏకపక్షమని దావాలో పేర్కొన్నారు. ఈ సుంకాలను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించి, తక్షణమే రద్దు చేయాలని రాష్ట్రాలు కోర్టును కోరాయి.

# మిస్టర్ డ్రామారావు" అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం 'ఎక్స్' వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న 'మిస్టర్ డ్రామారావు' కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు.

## పొగాకు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేయూత

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధి చేకూరనుంది. ఈ ప్యాకేజీలో భాగంగా ప్రతి రైతుకు రూ. 50 వేల చొప్పున వడ్డీలేని రుణాన్ని అందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ రుణాన్ని రెండేళ్ల కాలపరిమితిలో తిరిగి చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 250 కోట్లు కేటాయించింది. దీనికి అదనంగా, 'లో' (ూశీష), 'ఆఫ్-స్టైల్' (ూటట-ర్ఎశ్రీవ) రకాల పొగాకుకు కిలోకు రూ. 10 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తుందని, ఈ మొత్తం నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ అవుతుందని వివరించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై దాదాపు రూ. 100 కోట్ల భారం పడుతుందని అంచనా వేశారు. పొగాకు ఎగుమతిదారులు సైతం కనీస కొనుగోలు ధరలకు అంగీకరించారని పెమ్మసాని పేర్కొన్నారు. దీని ప్రకారం.. బ్రైట్ రకం కిలోకు రూ. 230, మీడియం రకం రూ. 190, లో రకం రూ. 110 మరియు ఆఫ్-స్టైల్ రకం రూ. 130గా ధరలను నిర్ణయించారు. ఈ సహాయక చర్యలు సోమవారం నుంచే అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు.



# బ్రిజ్ భూషణ్‌కు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ఈ తీర్పును సవాలు చేయాల్సిందిగా రెజర్లు తమ న్యాయవాదులకు ఇప్పటికే తెలియజేశారని, త్వరలోనే అప్పీల్ దాఖలవుతుందని వినేశ్ ఫొగాట్ ప్రకటించారు. ఈ కేసులో తగిన సాక్ష్యాలు లేవని, సాక్షుల వాంగ్మూలాల్లోనూ స్థిరత్వం కొరవడింది. కొందరు పరస్పర విరుద్ధమైన సాక్ష్యాలు ఇచ్చారని తాము చేసిన వాదనన న్యాయమూర్తి అంగీకరించినట్లు బ్రిజ్‌భూషణ్, వినోద్ తోమర్‌ల తరఫు న్యాయవాది రాజీవ్ మోహన్ తెలిపారు. అయితే తీర్పు కాపీ అందక ముందే ఈ అంశాల ఆధారంగానే న్యాయమూర్తి తీర్పు ఇచి?చనట్లు ఆయనెలా చెబుతారని రెజ్లర్ల తరఫున వాదించిన న్యాయవాది రెబెకా జాన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆనాడే చెప్పా: బ్రిజ్ భూషణ్: "లైంగిక ఆరోపణలు నిజమైతే ఉరి వేసుకుంటానని మొదటి రోజు నుంచే చెప్పాను. నేడు నేను నిర్దోషిగా నిరూపితమవడం శుభవార్త"అని బ్రిజ్‌భూషణ్ సింగ్ వ్యాఖ్యానించారు. కొనసాగుతుంది: బ్రిజ్‌భూషణ్‌ను నిర్దోషిగా విడుదల చేయడంపై రెజ ర్లు వినేశ్ ఫొగాట్, భజరంగ్ పూనియలు ఎక్స్‌పై స్పందించారు. రెజర్లు తమ విశ్వాసాన్ని కోల్పోలేదని, పోరాటం కొనసాగిస్తామని వ్యాఖ్యానించారు. ఫెడరేషన్ పాలకపక్షం, ప్రభుత్వం, వ్యవస్థలన్నీ మొదటి నుంచి కూడా బ్రిజ్‌భూషణ్‌ను రక్షించేందుకు పనిచేస్తూనే ఉన్నాయన్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా బ్రిజ్ భూషణ్ సింగ్ తమపై లైంగిక దాడులకు పాల్పడినట్లు, 2023 ఏప్రిల్--మేలో మహిళా రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 36 రోజులపాటు నిరసన చేపట్టారు. రెజ్లర్లు వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్, భజరంగ్ పునియాలు ఈ నిరసన కార్యక్రమాలకు నేతృత్వం వహించారు. చివరకు సుప్రీంకోర్టు జోక్యం తరువాత ఢిల్లీ పోలీసులు ఈ అంశంపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. బ్రిజ్ భూషణ్ తోమర్‌లపై జూన్ నెలలో ఛార్జిట్ నమోదైంది. 2024 మేలో కోర్టు లైంగిక వేధింపులు, బెదిరింపులపై కేసు నమోదు చేసింది.

# ఉద్యమ స్ఫూర్తి కోసం ఎటో చూడక్కరలేదు

అగత్యం మన యువతరానికి పట్టలేదు. వాస్తవానికి బంగ్లాదేశ్, నేపాల్‌లో జరిగిన ఉద్యమాలకు భారత ప్రతిష్టను దిగజార్చేందుకు జరిగిన ప్రయత్నాలు. అక్కడ ఉద్యమాలు హింసాత్మక బాటలో కొనసాగాయి. కానీ భారత్‌లో మనం ప్రత్యేకం. రాజ్యాంగబద్ధంగా, శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు చేపడుతున్నాం. మన విద్యార్థుల విదేశీయుల మాదిరి అనవసరంగా ఉద్రేకాలకు లోనుకారు. సంయమంతో డిమాండ్ల సాధన కోసం పోరాడతారు. జంతర్ మంతర్‌లో ఎంతో మంది విద్యార్థులు, సీజేపీ కార్యకర్తల తలలు పగలాయి. కాళ్లు, చేతులు విరిగాయి. అయినాసరే సంయమనం కోల్పోకుండా మొక్కవోని దీక్షతో నీట్ ఉదంతం సహా పరీక్షల వ్యవస్థ, విద్యావ్యవస్థలో సమూల మార్పుల కోసం శాంతియుతంగా పోరాడారు"అని అన్నారు. "దేశంలో ప్రతి ఎన్నికల్లోనూ కులం, మతం, ప్రాంతం వంటివి ప్రధానాంశాలుగా మారే సంస్కృతికి చరమగీతం పాడుదాం. ఎన్నికల్లో విద్య అనేది ప్రధాన అజెండాగా మారాలి. విద్యకు ఎన్నికల్లో ప్రధాన అజెండా హోదా దక్కకపోతే భవిష్యత్ గురించి ఆలోచన పెట్టుకోవడం వృథా. దేశ భవిష్యత్తుకు విద్య అనేదే అసలైన పెట్టుబడి. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీతో మనస్తాపం చెంది ప్రాణాలుతీసుకున్న బాధితుల కుటుంబాలకు హామీ ప్రకారం అందజేస్తామన్న నష్టపరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు మంజూరుచేయకపోవడం దారుణం. రాత్రికిరాత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు వందల అధికార పార?టల వద్ద కోట్లకొలదీ డబ్బు ఉంటుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలను కొనేందుకు వందల కోట్ల నగదును సిద్ధంగా ఉంచుకుంటారు. తీరా నీట్ ఉదంతంలో బాధిత విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలంటే మాత్రం రూపాయి కూడా బయటకు తీయరు. ఇకనైనా బాధితులకు వీలైనంత త్వరగా నష్టపరిహారం ఇవ్వాలి. ఇవ్వకపోతే మళ్లీ ఉద్యమబాటలో పయనిస్తాం"అని దీప్కే స్పష్టంచేశారు. "బీజేపీ నేతలు పార్లమెంట్‌లో, సభలు, సమావేశాల్లో ఇష్టమొచి?చనట్లు మాట్లాడతారు. అంతటి తెలివితేటలు, స్థాయి మా జెన్ జీ తరానికి లేవు. అది మాకు చేతకాదు. గూండాలకు, విద్యార్థులకు చాలా తేడా ఉంది. ఆ తేడా ఎప్పుడూ ఉంటుంది"అని బీజేపీపై వెటకారంగా మాట్లాడారు. "జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షల్లో తీవ్రస్థాయిలో అవకతవకలు జరిగాయి. న్యాయం కోసం జార్ఖండ్‌లో పరీక్షార్థులు ఉద్యమిస్తున్నారు. వాళ్లకు మా సీజేపీ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది. పబ్లిక్ సర?వస్ పరీక్షలతోపాటు ఇతర నియామక పరీక్షల్లో అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాల్సిందే. నియామక ఏజెన్సీల్లో సంస్కరణలు తేవాలి. జార్ఖండ్‌లో పరీక్షార్థుల ఉద్యమం ఏ రాజకీయ పార?టతో సంబంధంలేదు. లోపభూయిష్ట పరీక్ష వ్యవస్థమీదనే వాళ్లు పోరాడుతున్నారు. వాళ్ల డిమాండ్లకు మేం మద్దతిస్తున్నాం. విద్యావ్యవస్థ బాగు కోసం ఏ రాష్ట్రంలో ఉద్యమం ఆరంభమైనా సీజేపీ తన వంతు మద్దతు తెలుపుతుంది. అక్కడ ఏ పార్టీ అధికారంతో ఉంది అనేది మాకు సంబంధం లేదు"అని దీప్కే స్పష్టంచేశారు. "విద్యా వ్యవస్థ మౌలిక వసతుల దగ్గరికొచ్చేసరికి విదేశాల్లో అద్భుతమైన వనరులు, వసతులు ఉంటాయి. భారత్‌లో ఆ స్థాయిలో పరిస్థితులు లేనేలేవు. ఎంతో నేర్చుకుందామనుకుంటే అంతలా అక్కడి మౌలిక వసతులు విదేశీ విద్యార్థులను దోహదపడతాయి. మౌలికవసతుల రూపంలో విద్యార్థులకు ఎంతో తోడ్పాటుఅందుతుంది. భారత్‌లో ఇంకా పరిస్థితులు గ్రేడ్‌లు ఇవ్వడానికి పరిమితమయ్యాయి.నేను అమెరికా విద్యనభ్యసించేటప్పుడు ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్య, సిలబస్ ఉంది. భారత్‌లోనూ అలాగే ప్రాక్టికల్ అభ్యసన విధానం ఉంటే బాగుంటుంది. కానీ దురదృష్టవశాత్తు గత ప్రభుత్వాలతో పోలిస్తే ప్రస్తుత మోదీ సర్కార్ విద్యకు తక్కువ నిధులు కేటాయిస్తోంది.



# పసిపాపలకు తల్లిపాలే దివ్యౌషధం

- కాషాగూడెంలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు
- గ్రామంలో చైతన్య ర్యాలీ.. పాల్గొన్న ఉపసర్పంచ్ షరీఫ్

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల పరిధిలోని పాముకుంట మధిర గ్రామమైన కాషాగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు ఉత్సాహభరితంగా సాగాయి. అంగన్‌వాడీ టీచర్ కృష్ణలీల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉపసర్పంచ్ ఎం.డీ. షరీఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా తల్లులు, కిశోర బాలికలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను తెలిపేలా ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్‌వాడీ టీచర్ కృష్ణలీల మాట్లాడుతూ.. నవజాత శిశువులకు తొలి పాలు ఎంతో శ్రేయస్కరమని, వ్యాధి నిరోధక శక్తిని పెంచి పసిపాపలను ఆరోగ్యంగా ఉంచుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ షరీఫ్, స్థానిక తల్లులు, కిశోర బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో రాజాపేట భేష్

- జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన మండలం
- ఇప్పటివరకు 75 శాతం పనులు పూర్తి.. అధికారులకు కలెక్టర్ ప్రశంసలు

**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోనే రాజాపేట మండలం మొదటి విడతలో ప్రథమ స్థానంలో నిలిచింది. మండలంలో ఇప్పటివరకు 75 శాతం ఇండ్ల నిర్మాణాలు పూర్తవ్వడంతో ఎంపీడీవో నాగవేణి, హౌసింగ్ ఏఈ వివేకానంద్‌ల పనితీరును జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో మొదటి విడత కింద మొత్తం 484 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 303 ఇండ్ల నిర్మాణం పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. వచ్చే ఆగస్టు మాసంలో మరో 75 ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇక మండలంలోని రఘునాథపురం గ్రామం 100 శాతం లక్ష్య సాధనకు చేరువలో ఉంది. ఇక్కడ 43 ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటికే 39 గృహాల నిర్మాణం పూర్తయింది. స్థానిక నాయకుడు బుడిగె పెంటయ్య గౌడ్ ప్రత్యేక శ్రద్ధ వహించి పనులను పర్యవేక్షించడమే ఈ పురోగతికి కారణమని తెలుస్తోంది. రఘునాథపురాన్ని ఆదర్శంగా తీసుకుని మిగతా గ్రామాల్లోనూ పనులు వేగవంతం చేసి, జిల్లాను ముందంజలో నిలపాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు.

# దళిత సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

- సబ్‌ప్లాన్ నిధులను పునరుద్ధరించాలి: డీహెచ్‌పీఎస్ డిమాండ్
- యాదాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా.. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ




**తొలివెలుగు, రాజాపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల సంక్షేమాన్ని తీవ్రంగా విస్మరిస్తోందని, సబ్‌ప్లాన్ నిధులను పునరుద్ధరించి ప్రతి దళిత కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షురాలు ఇంజ హేమలత, ప్రధాన కార్యదర్శి జిట్టా రాములు డిమాండ్ చేశారు. డీహెచ్‌పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఎస్సీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలని కోరారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో దళితులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాలను మంజూరు చేసి, ప్రతి పేద దళిత కుటుంబానికి ఇల్లు అందించాలని, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను మళ్లించకుండా దళితుల అభివృద్ధి కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని దళితవాడల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఇండస్ట్రియల్ రుణాల సబ్సిడీ విడుదల చేసి, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాకు ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు పిట్టల శంకర్, పోతూ ప్రవీణ్, మామిడికాయల నరసింహ, చెడె సుందరయ్య, గుండెపు వెంకటయ్య, వాసం గాలయ్య, వెంకన్న, ధనమ్మ, స్వామి, ముత్యాలు, జంగయ్య, శ్యాగ జానూ, మనోహర, శ్రీను, రాములు, అండాలు, వసంత తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూదే కీలక పాత్ర



- ప్రభుత్వంతో చర్చించి హక్కులు సాధించేది మా సంఘమే: జిల్లా ప్రధాన కార్యదర్శి గడసంతుల మధుసూదన్
- బొందుగులలో పీఆర్టీయూ-టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం
- సీపీఎస్ రద్దు, పీఆర్సీ, డీఏ బకాయిల చెల్లింపుపై ప్రభుత్వాన్ని డిమాండ్



**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న సంఘం పీఆర్టీయూ-టీఎస్ మాత్రమేనని యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గడసంతుల మధుసూదన్ అన్నారు. సోమవారం రాజాపేట మండలంలోని బొందుగుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ-టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా పీఆర్టీయూ-టీఎస్ నిరంతరం పనిచేస్తోందన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రధాన సమస్యలైన సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏలు, పీఆర్సీని మెరుగైన ఫిట్‌మెంట్‌తో ప్రకటించడం, ఇతర బకాయిలను వెంటనే చెల్లించడం వంటి డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అవసరమైతే సెప్టెంబర్ నెలలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ఉపాధ్యాయులకు అందించాల్సిన హెల్త్ స్కీమ్ (హెచ్‌ఎస్) కార్డులు కూడా త్వరలో అమల్లోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పీఆర్టీయూ-టీఎస్ మాటలకే పరిమితమయ్యే సంఘం కాదని, కార్యాచరణతో ముందుకు సాగే సంఘమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పరమేష్, రాజాపేట మండల అధ్యక్షుడు సంపతి సుబ్బరాజు, మండల ప్రధాన కార్యదర్శి గౌటే బాలరాజు, మహిళా ఉపాధ్యక్షురాలు వాంకుడోతు భారతి, జిల్లా బాధ్యులు రవీందర్, నరేష్, పలువురు ఉపాధ్యాయులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలే రైతులకు రక్ష

- ఎల్‌నినో ప్రభావంతో అప్రమత్తంగా ఉండాలి: జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరమణ రెడ్డి
- తక్కువ నీటి అవసరమున్న పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచన
- శాస్త్రీయ యాజమాన్యంతోనే నష్టాల నివారణ సాధ్యం



**తొలివెలుగు, రాజాపేట:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ పంటల కంటే తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరమణ రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతు వేదికల ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జూన్ నెలలో సాధారణంగా కురవాల్సిన వర్షపాతం నమోదుకాకపోవడంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను అనుసరిస్తేనే పంటలను కాపాడుకోవచ్చున్నారు.

**నేల తేమ సంరక్షణపై ప్రత్యేక దృష్టి:**

పొలాల్లో అంతరకృషి చేపట్టి కలుపు మొక్కలను పూర్తిగా తొలగించాలని, రిడ్జ్ అండ్ ఫరో (బోదెలు-చాళ్ల) విధానంలో వర్షపు నీటిని పొలంలోనే నిల్వ ఉంచి నేల తేమను కాపాడాలని సూచించారు. నత్రజని ఎరువులు (యూరియా) నేలలో తగినంత తేమ ఉన్నప్పుడే వేయాలని, అందుబాటులో ఉన్న నీటిని రక్షణాత్మక సాగునీటికి మాత్రమే వినియోగించాలని తెలిపారు. రైతులు తమ పొలాలను తరచూ పరిశీలిస్తూ చీడపీడలను ప్రారంభ దశలోనే గుర్తించి, ఆర్థిక నష్టం స్థాయికి చేరిన తర్వాత మాత్రమే వ్యవసాయ నిపుణుల సలహాతో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

**ప్రత్యామ్నాయ పంటలతో అధిక ప్రయోజనం:**

వర్షాభావ పరిస్థితుల్లో పెసర, మినుము, నువ్వులు, జొన్న, సజ్జలు వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయడం లాభదాయకమని తెలిపారు. అలాగే మార్కెట్ సౌకర్యం, నాటే మొక్కల లభ్యత ఉన్న ప్రాంతాల్లో లెమన్ గ్రాస్ వంటి సుగంధ పంటలను కూడా ప్రత్యామ్నాయంగా సాగు చేయవచ్చని సూచించారు.

**పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలి:**

పొడి వాతావరణం కొనసాగితే పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్త రమ్య తెలిపారు. ప్రారంభ దశలో ఎకరానికి ఒక లీటర్ వేపనూనె (1500 పీపీఎం) పిచికారీ చేయాలని సూచించారు. ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 2 మిల్లీ లీటర్లు ఫిప్రోనిల్ లేదా 0.3 గ్రాములు ఫ్లోనికామిడ్ కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. అలాగే రసాయన రహిత నియంత్రణ కోసం ఎకరానికి 10 నుంచి 15 పసుపు లేదా నీలం రంగు స్టిక్కీ ట్రాప్స్‌తో పాటు ఒకటి లేదా రెండు సోలార్ లైట్ ట్రాప్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

**వరి, మొక్కజొన్న రైతులకు సూచనలు:**

వరి పంటలో కాండం తొలిచే పురుగు ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8 కిలోలు సమానంగా వెదజల్లి, అనంతరం పొలంలో స్వల్పంగా నీరు నిల్వ ఉండేలా చూడాలని సూచించారు. ఆలస్యంగా నాటిన వరి పొలాల్లో ఈ పురుగు ప్రభావం అధికంగా ఉండే అవకాశమున్నందున రైతులు ప్రత్యేక అప్రమత్తత పాటించాలని హెచ్చరించారు.దమొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి కనిపిస్తే లీటరు నీటికి 0.3 గ్రాములు ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా 0.4 మిల్లీ లీటర్లు క్లోరాంట్రానిలిప్రోల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

**వాతావరణ సమాచారాన్ని అనుసరించాలి:**

వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నందున రైతులు ప్రతిరోజూ వాతావరణ సూచనలను గమనిస్తూ, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసే తాజా వ్యవసాయ సలహాలను తప్పనిసరిగా అనుసరించాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరమణ రెడ్డి సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో నేల తేమ సంరక్షణ, పంటల రక్షణ, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులే దిగుబడిని కాపాడే ప్రధాన మార్గాలని ఆయన పేర్కొన్నారు.

# చెంగిచెర్లలో జీఎంపీఎస్ రాష్ట్ర మహాసభలు

- ఆగస్టు 22-24న చెంగిచెర్లలో జీఎంపీఎస్ రాష్ట్ర 4వ మహాసభలు
- గొర్రెల పంపిణీ హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి
- జీఎంపీఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు



**తొలివెలుగు, చౌటుప్పల్:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా చెంగిచెర్ల వేదికగా ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరిగే గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు పిలుపునిచ్చారు. సోమవారం చౌటుప్పల్ పట్టణంలో కొండె శ్రీశైలం అధ్యక్షతన జీఎంపీఎస్ రెవెన్యూ డివిజన్ స్థాయి ప్రాంతీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మద్దెపురం రాజు మాట్లాడుతూ.. సమాజానికి పోషకాహారం అందిస్తున్న గొల్ల, కురుమ వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఇంకా వెనుకబడే ఉన్నాయన్నారు. గత మూడు దశాబ్దాలుగా గొర్రెల కాపరుల హక్కుల కోసం జీఎంపీఎస్ నిరంతర పోరాటాలు చేస్తూ అనేక విజయాలు సాధించిందని ఆయన గుర్తుచేశారు. ఉచిత మేత హక్కుల కోసం యాదాద్రి జిల్లాలో రోడ్లపై జీవాలతో రాస్తారోకోలు చేసి, పెత్తందారులను ఎదిరించిన ఫలితంగానే 1016, 559, 64 జీవోలు అమల్లోకి వచ్చాయన్నారు. దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో పశువైద్య సేవలు, ఎక్స్‌గ్రేషియా, సబ్సిడీ రుణాల సాధనలో సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే నగదు బదిలీ ద్వారా గొర్రెల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి, రెండున్నర ఏళ్లు గడుస్తున్నా అమలు చేయకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే హామీని నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాసభల్లో గొల్ల, కురుమ సోదరులు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారు నర్సింహం, జిల్లా సహాయ కార్యదర్శి కొండె శ్రీశైలం, ఉపాధ్యక్షుడు నారి వెంకటేష్, కమిటీ సభ్యులు భీమనబోయిన బాలరాజు, జెనిగల యాదయ్య, గాజుల అంజయ్య, నారి మల్లేశం, బుగ్గ లక్ష్మయ్య, గడగోటి జంగయ్య, అరిగె బీరప్ప, బెడిద రమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## రఘునాథపురంలో ఘనంగా గోరింటాకు ఉత్సవం

- సామూహికంగా పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలంలోని రఘునాథపురం గ్రామంలో సోమవారం ఆర్యవైశ్య మహిళలు సామూహికంగా గోరింటాకు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘ భవనంలో రఘునాథపురం పట్టణ అధ్యక్షులు ఉప్పల సిద్ధిలింగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మొదటగా శ్రీ వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోరింటాకు విశిష్టతను తెలియజేస్తూ మహిళలు భక్తి గీతాలు ఆలపించారు. సంప్రదాయ పద్ధతిలో గోరింటాకును ప్రత్యేక రోటిలో నూరి, ఒకరికొకరు గోరింటాకు అలంకరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో నిర్వహించే గోరింటాకు ఉత్సవం మహిళల్లో ఐక్యత, సాంస్కృతిక విలువలు, పరస్పర అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి రూ.5 వేల సాయం
- దశదిన కార్యక్రమంలో కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు



**తొలి వెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం బొందుగుల గ్రామంలో భారతీయ జనతా పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పార్టీ సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. సోమవారం గ్రామంలోని పదో వార్డు బీజేపీ సభ్యుడు ముక్క సందీప్ తండ్రి ముక్క బిక్షపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు ముత్యం రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన దశదిన కార్యక్రమంలో బాధిత కుటుంబానికి రూ.5,000 నగదు ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, అవసరమైన సందర్భాల్లో తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తరిగొప్పుల భాస్కర్, మాజీ ఎంపీటీసీ బల్దా సిద్ధులు, కొండూరి స్వామి, కట్ట బల్నార్సయ్య, కట్ట రవి, ముక్క యాదయ్య, ముక్క శ్యాంసుందర్, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏడాదికి ఇంటికో మొక్క నాటాలి

- మొక్కల సంరక్షణతోనే భావితరాలకు సురక్షిత భవిష్యత్
- పుట్టగూడెంలో మొక్కల పంపిణీ కార్యక్రమం
- ప్రతి మొక్కకు కుటుంబ సభ్యుల పేర్లు పెట్టి పెంచాలని సర్పంచ్ రాంజీ నాయక్ సూచన

**తొలివెలుగు, రాజాపేట:** ప్రతి కుటుంబం ఏడాదికి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా భావితరాలకు పచ్చని భవిష్యత్‌ను అందించాలని పుట్టగూడెం తండా సర్పంచ్ రాంజీ నాయక్ పిలుపునిచ్చారు. "హరిత పుట్టగూడెం" లక్ష్యంగా సోమవారం నిర్వహించిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్తులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మానవ మనుగడకు చెట్లు ఎంతో అవసరమని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి కుటుంబం తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను కుటుంబ సభ్యుడిలా సంరక్షించాల్సిన బాధ్యత అందరిదేనని అన్నారు. మొక్కలపై ప్రజల్లో మరింత అనుబంధం పెంచేందుకు వినూత్న సూచన చేస్తూ, ఇంట్లో మరణించిన వారి పేర్లు లేదా తమకు ఇష్టమైన వ్యక్తుల పేర్లను మొక్కలకు పెట్టి పెంచాలని కోరారు. అలా చేస్తే మొక్క పెరిగే కొద్దీ ఆ వ్యక్తి జ్ఞాపకం సజీవంగా ఉంటుందని, మొక్కల సంరక్షణపై మరింత శ్రద్ధ పెరుగుతుందని తెలిపారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటి వాటిని క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, హరితహారం వంటి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భద్రి దేవుల నాయక్, ఏఎంసీ డైరెక్టర్ మన్య నాయక్, పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బురదతోవలో 'మోడల్' చదువులు..!





- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి హామీని నిలబెట్టుకోవాలి: ఎస్ఎఫ్ఐ
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న యంత్రాంగం
- రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరిక

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలంలోని మోడల్ స్కూల్ నుండి ప్రధాన రహదారి (హైవే) వరకు సీసీ రోడ్డు నిర్మిస్తామని స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) చౌటుప్పల్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఇప్పటికే రెండుసార్లు మోడల్ స్కూల్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, పనులు ప్రారంభం కాకపోవడం విచారకరమన్నారు. గత నాలుగేళ్లుగా విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వర్షాకాలంలో మట్టి రోడ్డు తీవ్ర బురదమయంగా మారి విద్యార్థులు జారిపడి గాయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రతను దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని, లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు ఇరిగి వరుణ్ తేజ్, నాయకులు పోలేపల్లి మల్లేష్, సర్వే అరవింద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడిని తట్టుకునే పంటలతోనే లాభాలు

- ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి
- తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలే మేలు: ఏఈఓ వీణా కుమారి
- లింగోజిగూడెంలో రైతులకు అవగాహన సదస్సు



**తొలివెలుగు, చౌటుప్పల్:** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ) వీణా కుమారి సూచించారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో సోమవారం నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. భూగర్భ జలాలు తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అధిక నీటి అవసరమున్న పంటల సాగు వల్ల నష్టాలు ఎదురయ్యే అవకాశముందని తెలిపారు. ప్రత్యామ్నాయంగా కంది, పెసర, ఆముదం, జొన్న, సజ్జలతో పాటు పలు రకాల కూరగాయల సాగు చేపట్టడం ద్వారా తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు, ఆదాయం పొందవచ్చని వివరించారు. నేల తేమను సంరక్షించే విధానాలు పాటిస్తూ, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని రైతులకు సూచించారు. వ్యవసాయంలో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను నివారించడంతో పాటు రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అందిస్తున్న సూచనలు, సాంకేతిక సలహాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారి సేవలో.. రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్

- ఆందోళ్ మైసమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో 21వ బోనాలోత్సవాలు
- శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ శ్యాంసుందర్ ముదిరాజ్‌కు అమ్మవారి చిత్రపటం అందజేత
- ఈవో మోహన్ బాబు, చైర్మన్ అశ్విన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన సన్మానం

**తొలివెలుగు, చౌటుప్పల్:** శ్రీ ఆందోళ్ మైసమ్మ 21వ బోనాలోత్సవాలలో భాగంగా మూడో రోజు ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్ ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) సల్వాది మోహన్ బాబు, ఆలయ చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డిలు ఆయనను ఘనంగా సన్మానించి, అమ్మవారి శేషవస్త్రాలతో పాటు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దేప శ్యాంసుందర్ ముదిరాజ్ ఆలయ కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, వార్డు మెంబర్ సుక్క రవీందర్, ఫక్కిరు వంశీధర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బుర్ర శివకుమార్ గౌడ్, ఆలయ ధర్మకర్తలు జొన్నగంటి దాసు, ఈద్దుల బాబు యాదవ్, మన్నే మహేందర్, బేతల నర్సింహ్మా, వెంకిరాల శివచారి, కాంగ్రెస్ నాయకులు మల్కాజిగిరి నర్సింహ్మా, ముదిగొండ మహేష్, సిల్వేరు సాయి తదితరులు పాల్గొన్నారు.





## వాచ్‌మెన్ కుటుంబానికి ఉపాధ్యాయుల చేయూత

- రూ. 21 వేల ఆర్థిక సహాయం అందజేత
- దశదిన కర్మలో పాల్గొని నివాళులర్పించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత మూడేళ్లుగా వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కట్టంగూరి నర్సయ్య గౌడ్ కుటుంబానికి ఉపాధ్యాయ బృందం తమ ఉదారతను చాటుకుంది. సోమవారం నిర్వహించిన నర్సయ్య గౌడ్ దశదిన కర్మ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకోజు భాస్కర్ నేతృత్వంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర సానుభూతి తెలిపారు. మానవతా దృక్పథంతో ఉపాధ్యాయ బృందం సేకరించిన రూ. 21,000/- ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేసి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోలేపాక నాగేందర్, కే సైదారెడ్డి, ఐ గోపి, ఏ శ్రీనివాస్, జె విజయనిర్మల, కే వెంకటేశ్వర్లు, పి స్వామి, కె నవీన్ కుమార్, సిహెచ్ కవిత, ఆర్ శివాజీ, ఏ చంద్రకళ, ఎం మల్లేశం, కే లక్ష్మి, ఇ వెంకటేశం, గులాం జిలాని, ఎస్ లింగయ్య, జీ స్వామి రాజ్, ఎం శారద, బి రవీందర్, ఎండి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో పోలీసుల మెరుపుదాడులు.. 6 కిలోల గంజాయి, 38 కోడిన్ సిరప్ బాటిళ్లు స్వాధీనం

**7 మంది నిందితులు, ముగ్గురు బాల నేరస్తుల అరెస్ట్**

**కోదాడ ఆగస్టు** కోదాడ పట్టణ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో 6 కిలోల గంజాయి, 38 కోడిన్ కలిగిన బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒక మోటార్‌సైకిల్, రెండు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు నిందితులు, ముగ్గురు బాల నేరస్తులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. గంజాయి విక్రయాలు, నిషేధిత దగ్గు మందుల అక్రమ రవాణాపై నిఘా పెట్టి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి గంజాయి, కోడిన్ సిరప్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలి

- విద్యార్థులకు కౌన్సిలర్ లావణ్య యాదగిరి సూచన
- ఎస్సీ బాలికల వసతిగృహంలో విద్యాసామగ్రి, ప్లేట్ల పంపిణీ

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని భూదాన్ పోచంపల్లి పురపాలక సంఘం 9వ వార్డు కౌన్సిలర్ జింకల లావణ్య యాదగిరి సూచించారు. సోమవారం పోచంపల్లిలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ప్రభుత్వం తరపున మంజూరైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్టీల్ ప్లేట్లు, బౌల్స్‌ను విద్యార్థినులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లావణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న వసతి గృహాలు, ఉచిత విద్యా సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. ముఖ్యంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని, తద్వారా తల్లిదండ్రులకు, చదువుతున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహం వార్డెన్ చంద్రకళ, హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైకి భారాస నాయకుల సన్మానం




**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి మండల నూతన ఎస్హెచ్ఓ (ఎస్సై)గా బాధ్యతలు స్వీకరించిన జగన్‌ను సోమవారం భారాస (బీఆర్ఎస్) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మండల పార్టీ అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షురాలు బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక పోలీసు స్టేషన్లో ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చిరువేరు బాల నరసింహ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నోముల మాధవరెడ్డి, అయితే రాజు బిక్షపతి, రామలింగంపల్లి సర్పంచ్ మండల రేణమ్మ శంకరయ్య, నాయకులు గోదాసు జంగయ్య, సీతయ్య, యువజన నాయకులు చింతకింది కిరణ్, శీతశ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- వీవర్ సర్వీస్ సెంటర్ రాష్ట్ర డైరెక్టర్ అరుణ్ కుమార్
- చేనేత కార్మికులకు ఉచిత కళ్లద్దాల పంపిణీ

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** కేంద్ర ప్రభుత్వం చేనేత కళాకారులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వీవర్ సర్వీస్ సెంటర్ (డబ్ల్యూఎస్‌సీ) తెలంగాణ డైరెక్టర్ అరుణ్ కుమార్ సూచించారు. పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఎంపికైన కార్మికులకు సోమవారం పురపాలక కేంద్రంలో కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పోచంపల్లి, నల్గొండ ప్రాంతాలకు చెందిన చేనేత కార్మికులు కేంద్ర ప్రభుత్వ పథకాలను పొందడంలో వెనుకబడి ఉన్నారన్నారు. కార్మికుల సంక్షేమం కోసం అందిస్తున్న ఉచిత వర్క్ షెడ్లు, ఆసు యంత్రాలు, ఇనుప మగ్గాల కోసం దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. ఇక్కడి కళాకారులు ఎంతో కళాత్మకమైన వస్త్రాలను రూపొందిస్తున్నప్పటికీ, తమ నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడంలో కాస్త వెనుకబడుతున్నారని అభిప్రాయపడ్డారు. జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించేలా విభిన్నమైన డిజైన్లతో వస్త్రాలను రూపొందించాలని, ఇందుకు వీవర్ సర్వీస్ సెంటర్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్మికుల కోసం సేవలు అందిస్తున్న పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీని ఆయన అభినందించారు. అనంతరం సంస్థ సీఈవో తడక రమేష్, రజనీ దంపతులు అరుణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం, వెంకటరమణ సిల్క్స్ చేనేత సొసైటీ అధ్యక్షుడు చింతకింది రమేష్, మాజీ కౌన్సిలర్ భోగ భానుమతి విష్ణు, నాయకులు ఒలంధాస్ ప్రవీణ్, కార్మిక సంఘం కార్యదర్శి బొమ్మ హరి, డైరెక్టర్లు గణేష్, గుండు రాజేశ్వరి, కటికం



# ముగిసిన ఆందోళ్ మైసమ్మ బోనాలోత్సవాలు





- చివరి రోజు భక్తిశ్రద్ధలతో గణపతి పూజ, పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహణ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- సహకరించిన అధికారులకు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ఈఓ

**తొలివెలుగు, చౌటుప్పల్:** శ్రీ ఆందోళ్ మైసమ్మ 21వ వార్షిక బోనాలోత్సవాలు మూడో రోజు వైభవంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహక అధికారి సల్వాది మోహన్‌బాబు మాట్లాడుతూ.. ఈ ఏడాది బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా, ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ ప్రజలు, స్వచ్ఛంద సేవకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందాలని కోరారు. ఆలయ చైర్మన్ కంచర్ల అశ్విని రెడ్డి, కార్యనిర్వాహక అధికారి సల్వాది మోహన్‌బాబు, అలుగుబెల్లి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు ఈడుదుల బాబు, బేతాళ నరసింహ, సిద్దిపేట ఆనందరెడ్డి, వెంకిర్యాల శివ, బాలగోని శ్రీకాంత్ గౌడ్, బొంతల యువరాజ్, మన్నే మహేందర్ రెడ్డి, దౌడీ రాజేష్, పన్నాల మహేందర్ రెడ్డి, ధేప రాజీవ్, పంతంగి రమేష్, జొన్నగంటి దాసు, చిట్టెంపల్లి సబిత, వల్లూరి శివప్రసాద్ శర్మతో పాటు గ్రామ ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముగింపు ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేయగా, ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి.

# మత్తు వద్దు.. భవిష్యత్తు ముద్దు






- మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు
- నారాయణ స్కూల్‌లో విద్యార్థులకు నార్కోటిక్స్‌పై అవగాహన
- యువత మత్తుకు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలి: చౌటుప్పల్ సీఐ జి. మన్మథ కుమార్

**తొలివెలుగు, చౌటుప్పల్:** విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండి చదువుపై దృష్టి సారిస్తేనే ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోగలరని చౌటుప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ్ కుమార్ అన్నారు. సోమవారం చౌటుప్పల్ పట్టణంలోని నారాయణ స్కూల్‌లో ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులకు నార్కోటిక్స్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం యువత జీవితాలను నాశనం చేయడంతో పాటు వారి ఆరోగ్యం, విద్య, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. స్నేహితుల ప్రలోభాలకు, తప్పుడు అలవాట్లకు లోనుకాకుండా ప్రతి విద్యార్థి తన లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన జీవన విధానమే విజయానికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఎక్కడైనా తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా కల్పించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు కలిసి పనిచేస్తేనే సమాజాన్ని ఈ మహమ్మారి నుంచి రక్షించగలమని చెప్పారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ వాటి నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి వాకిటి లక్ష్మమ్మ ఫౌండేషన్ ఆర్థిక సాయం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండలంలోని గోస్కొండ గ్రామానికి చెందిన లింగాల చంద్రమ్మ అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మునుకుంట్ల నరేష్ గౌడ్, ఉపసర్పంచ్ వాకిటి బాల్రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చంద్రమ్మ భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వాకిటి లక్ష్మమ్మ ఫౌండేషన్ తరపున రూ.5 వేల ఆర్థిక సాయాన్ని ఉపసర్పంచ్ బాల్రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పకీరు దేవేందర్ రెడ్డి, వాకిటి జంగారెడ్డి, నాంపల్లి రవీందర్ రెడ్డి, నోముల శ్రీనివాసరెడ్డి, లింగాల మధు, శంకర్, దోసపాటి కృష్ణ, బాలరాజు, సుమన్, మల్లేష్, వంగూరి స్వామి, పరమేష్, కందుకూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.





## చిన్నకంజర్ల భూవ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలి: సిపిఎం డిమాండ్

పటాన్‌చెరు మండలం చిన్నకంజర్ల గ్రామ భూవ్యవహారాలపై సమగ్ర విచారణ చేపట్టాలని, సర్వే నెం.113 పరిధిలో భూసేకరణకు గురైన రైతులందరికీ పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రామ రెవెన్యూ అధికారి (జీపీఓ) బండారి రాజును వెంటనే విధుల నుంచి తొలగించాలని కోరుతూ సిపిఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి బి. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. చిన్నకంజర్ల గ్రామంలోని సర్వే నంబర్ 113లో 185 ఎకరాల భూమిని పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం సేకరిస్తోందని తెలిపారు. గ్రామసభలో రైతులకు ఎకరానికి రూ.28 లక్షల నష్టపరిహారం, ప్రతి కుటుంబానికి 200 గజాల ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటివరకు రెండు దఫాల్లో 125 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించినట్లు చెప్పారు. అయితే జీపీఓ బండారి రాజు ప్రజాప్రతినిధులు, మధ్యవర్తులతో కుమ్మక్కై రైతుల నుంచి లక్షల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. భూ రికార్డులను తారుమారు చేసి, పట్టాదారు పాస్‌పుస్తకాలు, పక్కా ఎంజాయ్‌మెంట్ ఉన్న రైతులకు కూడా పూర్తి నష్టపరిహారం అందకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. విధి నిర్వహణ గ్రామంలో కాకుండా ఇతర ప్రాంతాల నుంచి నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, రైతులను భయభ్రాంతులకు గురిచేసి మధ్యవర్తుల ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని అన్నారు. జీపీఓపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.



## బిడ్డకు శ్రీరామరక్ష.. తల్లిపాలే!

- పీపల్ పహాడ్‌లో ఉత్సాహంగా తల్లిపాల వారోత్సవాలు
- గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహణ
- పాల్గొన్న సర్పంచ్ పులనగారి నాగేశ్వరి అశ్విని కుమార్ గౌడ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** నవజాత శిశువులకు తల్లిపాలే అమృతమని, పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి అవి ఎంతో దోహదపడతాయని పీపల్ పహాడ్ గ్రామ సర్పంచ్ పులనగారి నాగేశ్వరి అశ్విని కుమార్ గౌడ్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలంలోని పీపల్ పహాడ్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక అంగన్వాడీ టీచర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ నాగేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని, భవిష్యత్తులో పిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని ఆమె తల్లులకు అవగాహన కల్పించారు. అంతకుముందు అంగన్వాడీ కేంద్రం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు, కిశోర బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొని తల్లిపాల విశిష్టతను వివరిస్తూ ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. గ్రామీణ మహిళల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఈ ర్యాలీ సాగింది. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అంగన్వాడీ టీచర్ మాట్లాడుతూ.. ప్రతి తల్లి విధిగా ఆరు నెలల పాటు బిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అప్పుడే శిశు మరణాలను అరికట్టవచ్చని స్పష్టం చేశారు. పోషకాహార లోపాన్ని నివారించడంలో తల్లిపాల పాత్రను ఆమె సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బకనగారి శ్రవణ్ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు, తల్లులు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు, అంగన్వాడీ ఆయాలు, తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## దంచికొట్టిన వాన



నగరంలోని పలు చోట్ల సోమవారం భారీ వర్షం పడింది. మేడ్చల్ జిల్లా పరిధిలోని కాప్రా ప్రాంతంలో అత్యధికంగా 6.9సెం.మీ వర్షపాతం నమోదుగా, కొంగరకలాన్ ప్రాంతంలో 4.7సెం.మీ, మంకాల్ పారిశ్రామిక వాడలో 4.4సెం.మీ, చాంద్రాయణగుట్టలో 4.1సెం.మీ, ఉప్పల్‌లోని రాజీవ్ నగర్ 4.0సెం.మీ, గచ్చిబౌలిలో 3.8సెం.మీ వర్షపాతం నమోదైంది. శివారుతోపాటు, కోర్ సిటీలోని కొన్ని ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రోడ్లన్నీ జలమయయ్యాయి. భారీగా వరద నీరు లోతట్టు ప్రాంతాలకు చేరడంతో వాహన రాకపోకలు అంతరాయం ఏర్పడింది

## నిప్పులు చెరిగిన నిరుద్యోగులు

**పోస్టులు పెంచకపోతే ఊరుకోం**

19వేల పోలీస్ ఉద్యోగాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు సోమవారం ఇందిరాపార్క్ వద్ద మెరుపు ధర్నాకు దిగారు. వివిధ నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. ఇందిరాపార్క్ రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. 7,437 పోస్టులతో కాకుండా 19వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసనలో జేఏసీ నేతలు కొడంగల్ రవి, మధుసూదన్, శ్రీకాంత్ రాథోడ్, వీరేశ్, కరుణాకర్, ప్రతాప్, శివ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



# రసాయన వరదలో రహదారి దిగ్బంధం..!

రసాయన నీటితో ప్రాణగుప్పెట్లో వాహనదారులు

**దోతిగూడెం–మసీదుగూడెం మార్గం జలమయం.. ప్రయాణికులకు నరకయాతన**





- దోతిగూడెం–మసీదుగూడెం రహదారిపై రసాయన కలుషిత నీరు నిల్వ
- కాలువను మూసివేసిన సెన్సేషన్ కంపెనీ.. ప్రయాణికులకు నరకప్రాయం
- కెమికల్ నీటిలో నడిస్తే చర్మంపై దద్దుర్లు.. ప్రాణగుప్పెట్లో వాహనదారులు
- యాజమాన్యం స్పందించకుంటే కట్టడం కూల్చేస్తాం: సర్పంచ్ యాట జంగయ్య
- సొంత ఖర్చులతో గుంతలు పూడ్చుకుంటున్న రైతులు: పగిళ్ల లింగారెడ్డి

ప్రయాణికులకు నరకప్రాయం
అధికారులు స్పందించాలి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని దోతిగూడెం నుండి మసీదుగూడెం వెళ్లే రహదారి పూర్తిగా జలదిగ్బంధమైంది. ఆ దారి వెంట వెళ్లాలంటే ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దోతిగూడెం శివారులో ఉన్న సెన్సేషన్ కెమికల్ కంపెనీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కాలువను మూసివేయడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు మండిపడుతున్నారు.

**కాలుష్య కోరల్లో రహదారి:**

సెన్సేషన్ కంపెనీ పక్క నుండి వెళ్లే వరద నీటి కాలువను ఓ స్థానిక రైతు తన పొలంలో నిర్మించుకోగా.. కంపెనీ యాజమాన్యం ఆ కాలువను పూర్తిగా మూసివేసింది. దీంతో వరద నీరు వెళ్లే మార్గం లేక ఆ ప్రాంతమంతా పూర్తిగా జలమయంగా మారింది. దీనికి తోడు కెమికల్ కంపెనీ నుంచి వచ్చే కలుషిత వ్యర్థాలు కూడా ఈ వరద నీటిలో కలుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నీటి గుండా కాలినడకన వెళ్లే పాదచారుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కలుషిత నీటి ప్రభావంతో వారి ఒళ్లంతా దద్దుర్లు వచ్చి తీవ్ర చర్మవ్యాధుల బారిన పడుతున్నారు. మరోవైపు ద్విచక్ర వాహనదారులకు అసలు రహదారి ఎక్కడ ఉందో, గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. ఈ నరకప్రాయమైన దారికి మోక్షం ఎప్పుడు కలుగుతుందా అని దిక్కుతోచని స్థితిలో స్థానికులు ఎదురుచూస్తున్నారు.

**స్పందించకపోతే కట్టడాలను కూల్చేస్తాం: యాట జంగయ్య, సర్పంచ్**



"సెన్సేషన్ కంపెనీ యాజమాన్యం ఎవరి అనుమతులు లేకుండా, తమ ఇష్టానుసారం వరద నీటి కాలువను మూసివేసింది. దీనివల్లే దారి పూర్తిగా జలమయమైంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా ఇప్పటికే కంపెనీకి పలుమార్లు నోటీసులు పంపినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ఒకవేళ కంపెనీ యాజమాన్యం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే, ప్రయాణికుల సౌకర్యార్థం పంచాయతీ ఆధ్వర్యంలో ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే ఆ అక్రమ కట్టడాన్ని తొలగిస్తాం. ఈ మేరకు కార్యదర్శి ద్వారా కంపెనీకి తుది సమాచారం అందించాం."

**పాలకవర్గం నిర్లక్ష్యం విడనాడాలి: పగిళ్ల లింగారెడ్డి, స్థానిక రైతు**



"గతంలో ఇక్కడ మంచి రహదారి ఉండేది. ఇప్పుడు ఆ ప్రాంతమంతా జలమయంగా మారడంతో మా పంట పొలాలకు వెళ్లాలంటే నరకం కనిపిస్తోంది. ఒకవైపు కంపెనీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుంటే, మరోవైపు సంబంధిత రైతుతో కనీస సంప్రదింపులు జరపకుండా గ్రామ పంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యం వహించడం దారుణం. కాలుష్యభరితంగా మారిన ఈ రహదారిని వెంటనే పునరుద్ధరించాలి. ప్రయాణించడం తీవ్ర ఇబ్బందిగా మారడంతో గత్యంతరం లేక కొందరు రైతులు తమ సొంత నిధులతో కంకర, డస్ట్ పోయించి దారిని బాగు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించాలి."

# అవయవ దానంతో మరెందరికో పునర్జన్మ



నల్లగొండ, ఆగస్టు 3: జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని అవయవదానంపై సమాజంలో మరింత అవగాహన కల్పించి, మరణానంతరం కూడా అనేక మంది జీవితాలకు వెలుగునిచ్చిన అవయవదాతల కుటుంబాలను గౌరవించాలనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్టు, లయన్స్ క్లబ్ నల్గొండ ఆధ్వర్యంలో నల్గొండ కలెక్టర్ చంద్రశేఖర్ సోమవా రం తన చాంబర్‌లో సన్మానం చేశారు. ఈ సందర్భంగా అవయవదాన ప్రతిజ్ఞ పత్రంపై సంతకం చేసి, అవయవదానంపై సంపూ ర్ణ మద్దతు తెలిపారు. అనంతరం అవయవ దానం ద్వారా పలువురికి పునర్జన్మ ప్రసాదించిన తొమ్మిది మంది అవయవదాతల కుటుంబ సభ్యులకు శాలువాతో సన్మానించి, ప్రత్యేకంగా రూపొందించిన 'కృతజ్ఞతా పూర్వక' ప్రశంసా పత్రాలతో కూడిన ప్రత్యేకమైన ఫొటోఫ్రేంను అందజేసి, వారి త్యాగానికి గౌరవ వందనం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత విషాద సమయంలో కూడా తమ ప్రియమైన కుటుంబ సభ్యుల అవయవాలను దానం చేసేందుకు అంగీకరించిన కుటుంబ సభ్యులు నిజమైన మానవతా మూర్తులని కొనియాడారు. తమ వ్యక్తిగత దుఖాన్ని దిగమింగి, తెలియని వ్యక్తుల జీవితాలను కాపాడేందుకు తీసుకున్న ఈ మహోన్నత నిర్ణయం సమాజానికి ఆదర్శప్రాయమన్నారు. అవయవదానం అనేది మరణానంతరం కూడా జీవితాలను నిలబెట్టే మహాదానమని... ఒక అవయవదాత అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపుతారని అన్నారు. అలాంటి దాతల కుటుంబాలను గౌరవించడం సమాజం నైతిక బాధ్యత అన్నారు. వారి త్యాగం మరెందరో అవయవదానం చేసేందుకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 జిల్లా గవర్నర్ కేవీ ప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అశోక్ ఎర్రమాద, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్‌వీ కుమార్, ఐ డొనేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డా. హరనాథ్ కడిమి, కో–ఆర్డినేటర్లు చిరునోముల చంద్రశేఖర్, కోట సరిత, లయన్స్ సభ్యులు, అవయవదాతల కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# షాపింగ్ బిల్లుకు నో ఫోన్‌నెంబర్!

షాపింగ్ మాల్స్ ఎంట్రీ వద్ద.. రిటైల్ స్టోర్లలో బిల్లింగ్ దగ్గర మొబైల్ ఫోన్ నంబర్ అడుగుతున్నారా..? వారు అడిగిన వెంటనే చెప్పేస్తున్నారా..? అవసరం లేదు. వ్యక్తిగత మొబైల్ నంబర్‌ను వాణిజ్య కేంద్రాల వద్ద ఇవ్వాల్సిన అవసరం లేనే లేదు. ఈ విషయాన్ని చట్టాలు స్పష్టం చేస్తున్నాయి. షాపింగ్ మాల్స్, రిటైల్ స్టోర్లకు ఈ విషయమై ప్రభుత్వం ఏవైనా మార్గదర్శకాలు జారీ చేసిందా? అంటూ లోక్‌సభ ఎంపీ జనార్ధన్ సింగ్ సిగ్రివాల్ లోక్‌సభలో ఈ అంశాన్ని ప్రత్యేకంగా లెవనెత్తగా.. కేంద్రం బదులు ఇచ్చింది. రిటైలర్లకు వాటి అసోసియేషన్ల ద్వారా ఈ విషయంలో 2023 మే 26న సూచలను జారీ చేసినట్టు చెప్పారు. వీటి ప్రకారం.. వినియోగదారుల అభీష్టం మేరకే మొబైల్ నంబర్ తీసుకోవాల్సి ఉంటుంది. మొబైల్ నంబర్ వెల్లడించాలని ఏ నిబంధన కూడా నిర్దేశించడం లేదు. నంబర్ వెల్లడించేందుకు వినియోగదారులు తిరస్కరించొచ్చు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ రూల్స్ 2025



అన్నవి పౌరుల వ్యక్తిగత డేటా (మొబైల్ నంబర్లు సహా) దుర్వినియోగం కాకుండా, తగిన రక్షణ కల్పించాలని స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ తమ వ్యక్తిగత డేటా దుర్వినియోగం అయినట్టు గురిస్తే కేంద్ర వినియోగ వ్యవహారాల శాఖ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు కూడా చేయొచ్చు.



## ట్రూజాన్ సోలార్ టార్గెట్ రూ.650 కోట్లు!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సౌర విద్యుత్ వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో కార్యకలాపాలను గణనీయంగా విస్తరిస్తున్నట్లు ట్రూజాన్ సోలార్ పేరిట సౌర విద్యుదుత్పత్తుల సేవలందించే సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్ వ్యవస్థాపకుడు సీహెచ్ భవానీ సురేష్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ. 300--350 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దీనికి రెట్టింపు స్థాయిలో రూ. 600--650 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఇప్పటివరకు రెసిడెన్షియల్, కమర్షియల్ తదితర విభాగాల్లో 10,000కు పైగా రూఫ్‌టాప్ ఇన్‌స్టాలేషన్స్ చేసినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం 600 మంది పైగా సిబ్బందితో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు 5 రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నామని సురేష్ తెలిపారు. వచ్చే నాలుగైదు నెలల్లో తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్ తదితర 4 రాష్ట్రాలకు విస్తరిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు దాదాపు రూ. 80 కోట్లు ఇన్వెస్ట్ చేశామన్నారు.

## ఐక్యూ15ఆర్ స్మార్ట్‌ఫోన్: ధర ఎంతంటే?




ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ కొత్తగా 15ఆర్ ఫోన్‌ను మార్కెట్లో లాంచ్ చేసింది. డిస్కౌంట్లు, ఆఫర్లు పోగా ధర రూ. 40,999 నుంచి ప్రారంభమవుతుంది. మార్చి 3 నుంచి అమెజాన్, ఐక్యూ ఈ-స్టోర్, రిలయన్స్ డిజిటల్ స్టోర్స్ మొదలైన వాటిల్లో సేల్ మొదలవుతుంది. ఇందులో 6.59 అంగుళాల డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 8 జెన్ 5, 7600 ఎంఏహెచ్ బ్యాటరీ, సూపర్ కంప్యూటింగ్ చిప్ క్యూ2, ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆరిజిన్ ఓఎస్ 6.0 తదితర ఫీచర్లు ఉంటాయి. 4 ఏళ్ల పాటు సాఫ్ట్‌వేర్, 6 ఏళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ లభిస్తాయి. ఇది 100ఔ ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది.

## తెలంగాణలో మహీంద్రా నయా రోటావేటర్లు


ముంబై: దేశీయ వాహన తయారీ రంగ దిగ్గజ సంస్థల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా.. తెలంగాణ మార్కెట్‌కు తమ నూతన రోటావేటర్ సిరీస్‌ను పరిచయం చేసింది. మహావతార్, మహావతార్ హెచ్‌డీ పేరిట హెవీ-డ్యూటీ రోటావేటర్లను అందుబాటులోకి తెచ్చింది. ఎలాంటి భూముల్లోనైనా ఇవి సమర్థవంతంగా పనిచేయగలవని ఈ సందర్భంగా కంపెనీ స్పష్టం చేసింది. కాగా, అన్ని రకాల పంటలకు అనువైన కొత్త ఉత్పత్తులను తీసుకురావడానికి కట్టుబడి ఉన్నామని శు క్రవారం సంస్థ ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఇప్పటికే మహీంద్రా ట్రాక్టర్లు దేశీయ వ్యవసాయ రంగంలో ఎలాంటి పాత్రను పోషిస్తున్నాయో తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రాక్టర్లతోపాటు రైతులకు ఉపయోగపడేలా పంట సాగులో అవసరమైన అన్నిరకాల ఉత్పత్తులనూ మహీంద్రా మార్కెట్‌లోకి తెస్తున్నది. ఇందులోభాగంగానే సరికొత్త రోటావేటర్లను తీసుకొచ్చింది.

## 7 శాతానికి బీవోఎం గృహ వడ్డీరేటు

న్యూఢిల్లీ, ఆగస్టు 2 : ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం)..మాన్‌సూన్ ధమాకా ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్వల్పకాలం మాత్రమే అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ కింద గృహ రుణాలపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో వడ్డీరేటు 7.10 శాతం నుంచి 7 శాతానికి దిగొచ్చింది. దీంతోపాటు ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంటేషన్ చార్జీలను పూర్తిగా ఎత్తివేసింది. తమ వినియోగదారులందరికీ ఉత్తమ ఆర్థిక ప్రయోజనాలను కల్పించడంతోపాటు వారి కలలను సాకారం చేసుకోవడంలో సహాయపడటానికి బ్యాంక్ ఎల్లప్పుడు కృషి చేస్తున్నదని, దీంట్లోభాగంగానే ఒకేసారి మూడు ప్రయోజనాలు కల్పించాలని నిర్ణయించినట్టు పేర్కొంది. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో అందిస్తున్న అత్యల్ప గృహ రుణంపై వడ్డీరేటు 7 శాతం కాగా, వాహన రుణాలపై 7.45 శాతానికి అందిస్తున్నది బ్యాంక్ మాత్రమే. దీంతోపాటు జీరో ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంటేషన్ చార్జీలు లేకపోవడంతో కస్టమర్లకు ఆర్థిక ప్రయోజనాలు కలుగనున్నాయని పేర్కొంది.




# ఏఐ యుగం.. సముద్రంలో కేబుళ్లు కాపాడుకోవడమే కీలకం



న్యూఢిల్లీ: ఏఐ యుగంలో డిజిటల్ లక్ష్యాల సాధనకు సముద్ర అంతర్భాగంలో (సబ్ సీ) వేసే కేబుల్ నెట్‌వర్క్ కీలకమైందని టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లాహోటి తెలిపారు. అయితే, ప్రకృతి విపత్తులు, భౌగోళిక--రాజకీయ ఉద్రిక్తతలు, డేటాకి డిమాండ్ మొదలైన వాటి వల్ల తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న సబ్‌మెరైన్ కేబుల్ వ్యవస్థల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇందుకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించేందుకు సాంకేతిక ఆవిష్కరణలు, నిర్వహణపరమైన సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం, విధానాలపరమైన చర్యల్లాంటి బహుముఖ వ్యూహం అవసరమని పేర్కొన్నారు. కేబుల్స్ వేసే మార్గాల ప్లానింగ్, రిస్కులు తక్కువగా ఉండే ప్రాంతాలను ఎంచుకోవడం, రియల్ టైమ్ మానిటరింగ్ సిస్టమ్‌లను వినియోగించడంలాంటి అంశాలతో నష్టాలను నివారించవచ్చని బ్రాడ్‌బ్యాండ్ ఇండియా ఫోరం నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా లాహోటి చెప్పారు. సబ్‌మెరీన్ కేబుల్ వ్యవస్థ భద్రతను బలోపేతం చేసేందుకు అంతర్జాతీయ సహకారం, పటిష్టమైన నియంత్రణ విధానాలు అవసరమన్నారు. సబ్ సీ కేబుల్, డిజిటల్ క్లౌడ్ మౌలిక సదుపాయాలు డిజిటల్ ప్రపంచానికి, ఏఐ యుగానికి కీలకమైన ఇన్‌ఫ్రాగా మారాయని చెప్పారు. ఈ నేపథ్యంలో క్లౌడ్ మౌలిక సదుపాయాలకు సంబంధించి పటిష్టమైన సైబర్ సెక్యూరిటీ చర్యలు, నిరంతరం పొంచి ఉన్న ముప్పులను ప ర్యవేక్షించడం కీలకమని ఆయన పేర్కొన్నారు.

**రికార్డు స్థాయిలో డేటా వినియోగం..**

దేశీయంగా డిజిటల్ వినియోగం చాలా వేగంగా వృద్ధి చెందుతోందని, గత దశాబ్దకాలంలో బ్రాడ్‌బ్యాండ్ యూజర్ల సంఖ్య ఆరు రెట్లు ఎగిసిందని లాహోటి చెప్పారు. 2025 నవంబర్ నాటికి ఇది 100 కోట్ల మైలురాయిని అధిగమించిందని వివరించారు. కనెక్టివిటీ వల్ల డేటా వినియోగం రికార్డు స్థాయిలో పెరిగిందని, ప్రపంచంలోనే అత్యధికంగా మొబైల్ యూజర్లు నెలకు సగటున 27 జీబీ మేర వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. 'డేటా వినియోగం, డిజిటలీకరణ, ఏఐ వృద్ధి మొదలైన వాటి వల్ల గ్లోబల్ డేటా సెంటర్ల మౌలిక సదుపాయాలకు, సబ్‌మెరైన్ కేబుల్ వ్యవస్థలకు డిమాండ్ పెరుగుతోంది' అని లాహోటి చెప్పారు.

## యాక్టివాకు ఫుల్ డిమాండ్.. ఒక్క రాష్ట్రంలోనే 50 లక్షల సేల్స్!



హోండా మోటార్‌సైకిల్ ఒ స్కూటర్ ఇండియా కంపెనీకి చెందిన యాక్టివాకు ఇండియాలో మంచి డిమాండ్ ఉంది. దీంతో దేశవ్యాప్తంగా మంచి అమ్మకాలు పొందిన ఈ టూవీలర్.. ఒక్క మహారాష్ట్రలో మాత్రమే 50 లక్షల సేల్స్ సాధించింది. హోండా యాక్టివా స్కూటర్ 25 సంవత్సరాల్లో 50 లక్షల (ఒక్క మహారాష్ట్రలో మాత్రమే) అమ్మకాలను సాధించింది. కంపెనీ ప్రకారం.. పూణే, ముంబై, థానే, నాగ్‌పూర్ ఒ నవీ ముంబై వంటి ప్రధాన నగరాల్లో వీటి అమ్మకాలు ఎక్కువగా ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే ఈ స్కూటర్‌కు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.

**హోండా యాక్టివా**

మార్కెట్లో హోండా యాక్టివా రెండు మోడల్స్‌లో లభిస్తోంది. ఒకటి యాక్టివా 6జీ (110సీసీ), యాక్టివా 125 (125సీసీ). యాక్టివా 6జీ ధర సుమారు రూ.81,000 నుంచి రూ. 95,500 (ఎక్స్ షోరూమ్) వరకు ఉంటుంది. యాక్టివా 125 ధరలు రూ.91000 నుంచి రూ.96000 (ఎక్స్ షోరూమ్) మధ్యలో ఉంటుంది. యాక్టివా 6జీ స్కూటర్ 109.51 సీసీ ఇంజిన్ ద్వారా 7.8 పీఎస్ పవర్, 8.8 ఎన్‌ఎమ్ టార్క్ అందిస్తుంది. యాక్టివా 125 మోడల్ 123.92 సీసీ ఇంజిన్ ద్వారా 9.5 పీఎస్ పవర్, 11.5 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది.



## మెర్సిడెస్ బెంజ్ రీకాల్ ఈ మోడల్స్‌పై ఎఫెక్ట్

మెర్సిడెస్ బెంజ్ ఇండియా.. భారతదేశంలో స్వచ్ఛంద రీకాల్ ప్రకటించింది. ఈ ప్రభావం 149 వాహనాలపై చూపుతుంది. కంపెనీ దీనికి సంబంధించిన రీకాల్ నోటీసును ఫిబ్రవరి 15న జారీ చేసింది. బెంజ్ రీకాల్ ప్రభావం.. సీఎల్‌ఈ క్యాబ్రియోలెట్, సీఎల్‌ఈ 53 ఏఎంజీ కూపే ఒ సీ 63 ఎస్‌ఈ పెర్ఫార్మెన్స్ వాహనాలపై పడింది. అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (ూణాూ)లో సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున సంస్థ రీకాల్ జారీ చేసింది. కొన్ని సందర్భాల్లో.. ఎమర్జెన్సీ స్టాప్ అసిస్ట్ ఫంక్షన్ పనిచేయకపోవచ్చని కూడా మెర్సిడెస్ బెంజ్ పేర్కొంది.రీకాల్ ప్రభావానికి గురైన వాహనాలు 2 సెప్టెంబర్ 2024 ఒ 18 మార్చి 2025 మధ్య తయారు చేసినవని తెలుస్తోంది. రీకాల్ నోటీసు పొందిన కస్టమర్లు అధీకృత మెర్సిడెస్-బెంజ్ సర్వీస్ సెంటర్లు నేరుగా సంప్రదించి.. అవసరమైన తనిఖీ చేసుకోవచ్చు. డబ్బు చెల్లించకుండానే సమస్యను పరిష్కరించుకోవచ్చు.

## మరో కొత్త కారు.. మార్కెట్లోకి టేరాన్ ఆర్-లైన్

ముంబై: ప్రముఖ ఆటో మొబైల్ దిగ్గజం వోక్స్ వ్యాగన్ సరికొత్త కారును మార్కెట్ లోకి లాంచ్ చేసింది. వ్యాగన్ టేరాన్ ఆర్--లైన్ పేరుతో వచ్చిన ఈ 7 సీటర్ ఎస్‌యూవీ ధర రూ.46.99 లక్షలుగా (ప్రారంభ ఎక్స్-షోరూం ధర) కంపెనీ నిర్ణయించింది. డిజైన్ పరంగా ఈ వాహనం ముందుభాగంలో ఐక్యూ లైట్‌తో కూడిన హెడ్ మ్యాట్రిక్స్ ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్‌లున్నాయి.ఈ టేరాన్ ఆర్--లైన్‌లో 2.0--లీటర్ టీఎస్‌ఐ ఈఏ888 ఈవోఓ4 పెట్రోల్ ఇంజిన్ అందించారు. ఈ శక్తివంతమైన ఇంజిన్ గరిష్టంగా 204 పీఎస్ పవర్, 320 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనికి 7--స్పీడ్ డీఎస్‌జీ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ జతచేశారు. 4మోషన్ ఆల్--వీల్ డ్రైవ్ (ఏడబ్ల్యూడీ) సిస్టమ్ వాహనానికి మెరుగైన గ్రిప్, స్థిరత్వాన్ని అందిస్తుంది. టెక్నాలజీ విషయానికి వస్తే, రెండు హై--పవర్ యూఎస్‌బీ--సీ (45డబ్ల్యూ) పోర్ట్‌లు, రెండు మొబైల్ ఫోన్‌ల కోసం వైర్‌లెస్ ఛార్జింగ్ సదుపాయం ఇవ్వడం ద్వారా కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అదనంగా, ఆగ్మెంటెడ్ రియాలిటీ(ఏఆర్) హెడ్--అప్ డిస్‌ప్లే ద్వారా నావిగేషన్, వేగం వంటి ముఖ్యమైన సమాచారం డ్రైవర్‌కు నేరుగా విండ్‌స్క్రీన్‌పై ప్రొజెక్ట్ అవుతుంది.





# బ్రేకప్ వార్తల పై అనుపమ రియాక్షన్..!

గత కొన్ని వారాలుగా సోషల్ మీడియాలో జరుగుతున్న తన బ్రేకప్ రూమర్స్ పై నటి అనుపమ పరమేశ్వరన్ ఎట్టకేలకు స్పందించింది. ఎవరి పేరునూ ప్రస్తావించకుండా, గడిచిన ఏడాది కాలం తన జీవితంలో ఎమోషనల్‌గా ఎంతో కష్టంగా గడిచిందని, ఒకానొక దశలో తనని తాను కోల్పోయినంత పని అయిందని ఆమె తెలిపింది. తమిళ నటుడు ధృవ్ విక్రమ్‌తో కలిసి 'బైసన్ కాలమాడన్' చిత్రంలో నటించినప్పటి నుండి వీరిద్దరి ప్రేమాయణం గురించి, ఆ తర్వాత సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేసుకోవడం, భావోద్వేగపూరిత పోస్టుల గురించి రూమర్లు ఊపందుకున్నాయి. అయితే, తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఈ రూమర్లను ఆమె నేరుగా ధృవీకరించడం కానీ, ఖండించడం కానీ చేయలేదు. ?గత ఏడాది ఎదురైన ప్రతికూల పరిస్థితులు తనకు తన స్వయం ప్రాధాన్యతను గుర్తుచేశాయని, ఇన్నాళ్లూ ఇతరుల కోసం బతికిన తాను ఇప్పుడు తన జీవితంపై పూర్తి నియంత్రణ తీసుకున్నానని అనుపమ పేర్కొంది. ప్రస్తుతం తాను ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా ఉన్నానని, గతాన్ని వదిలేసి ముందుకు సాగడంపైనే దృష్టి పెట్టానని స్పష్టం చేసింది. అలాగే, తన వ్యక్తిగత జీవితంలోని ప్రతి విషయాన్ని అందరికీ వివరించాల్సిన అవసరం లేదని, కొన్ని అనుభవాలు వ్యక్తిగతంగా ఉంటేనే మంచిదని ఆమె అభిప్రాయపడింది. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో మళ్లీ కొత్త చర్చకు దారితీసినప్పటికీ, బ్రేకప్ రూమర్లపై ఆమె మాత్రం ఎటువంటి క్లారిటీ ఇవ్వలేదు.

# చెన్నై లవ్‌స్టోరీఏ50 కోట్లు

"చెన్నై లవ్‌స్టోరీ' చిత్రాన్ని యువతతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా బాగా ఆదరిస్తున్నారు. వీక్‌డేస్‌లో కూడా మంచి వసూళ్లు సాధించడం ఆనందంగా ఉంది. ఈ సినిమాకు ప్రేక్షకులు లాంగ్‌న్ ఇవ్వబోతున్నారు' అన్నారు కిరణ్ అబ్బవరం. ఆయన హీరోగా రవి నంబూరి దర్శకత్వంలో ఎస్‌కేఎన్, సాయిరాజేష్ నిర్మించిన 'చెన్నై లవ్‌స్టోరీ' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రం యాభైకోట్ల వసూళ్లను సాధించినట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ.. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని ఈ సినిమా నిరూపించిందని, కిరణ్ అబ్బవరం కెరీర్‌లోనే బిగ్‌హిట్‌గా నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కో ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని, చిత్ర కథానాయిక శ్రీగౌరిప్రియ తదితరులు పాల్గొన్నారు.



# 'అలియాస్ రుక్మిణీ' ప్రారంభం

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'అలియాస్ రుక్మిణీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గత ఏడాది 'కోర్ట్' వంటి సక్సెస్‌ఫుల్ మూవీ తర్వాత హీరో నాని సమర్పణలో యునానిమస్ ప్రొడక్షన్ పతాకంపై రెండో ప్రయత్నంగా ఈ తాజా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకుడు. దీప్తి గంటా నిర్మాత. సోమవారం ఈ చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి నాని క్లాప్‌నివ్వగా, నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి కెమెరా స్విఛాన్ చేశారు. ఇదొక అందమైన ప్రేమకథ అని, ప్రేక్షకులకు చాలాకాలం గుర్తుండిపోతుందని, త్వరలో షూటింగ్ ప్రారంభిస్తామని నాని తెలిపారు. "కోర్ట్' తర్వాత ఎన్నో కథలు విన్నాం. ఈ కథలో కొత్తదనం బాగా నచ్చింది. కథానాయకుడు కృష్ణ పాత్ర కోసం సరైన హీరోని వెతుకుతున్న టైంలో 'నితిన్ అన్నను అడుగుదాం' అని నాని సలహా ఇచ్చారు. కృష్ణ పాత్రకు నితిన్ పర్‌ఫెక్ట్‌గా సరిపోయారు' అని నిర్మాత దీప్తి గంటా చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: జోమోన్ టి జాన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, రచన-దర్శకత్వం: మురళీకాంత్ దేవసోత్.





# హాట్ టాపిక్‌గా కీర్తి సురేష్ రెమ్యునరేషన్..

టాలీవుడ్ హిట్ పెయిర్ నాని, కీర్తి సురేష్ కాంబినేషన్‌కు స్పెషల్ క్రేజ్ ఉంది. 'నేను లోకల్', 'దసరా' వంటి సినిమాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన ఈ జంట మరోసారి ఒకే తెరపై కనిపించబోతోంది. అయితే ఈసారి పూర్తిస్థాయి పాత్రలో కాకుండా, నాని నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ది ప్యారడైజ్'లో కీర్తి సురేష్ ఒక సర్ప్రైజింగ్ స్పెషల్ సాంగ్‌లో మెరవనున్నట్లు సమాచారం. ఈ ప్రత్యేక పాట చిత్రీకరణ కోసం కీర్తి సురేష్ కేవలం రెండు రోజుల కాల్‌షీట్లు మాత్రమే కేటాయించినట్లు టాక్ నడుస్తోంది. అయితే, కేవలం ఈ రెండు రోజుల షూటింగ్ కోసం ఆమె అందుకోబోతున్న రెమ్యూనరేషన్ ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఖచ్చితమైన మొత్తం బయటకు రానప్పటికీ, ఆమెకు భారీ స్థాయిలో పారితోషికం చెల్లిస్తున్నారని వార్తలు వస్తుండటంతో కీర్తికి ఉన్న క్రేజ్ మరోసారి నిరూపితమైంది. దర్శకుడు శ్రీకాంత్ ఒదెల ఈ స్పెషల్ సాంగ్‌ను చాలా గ్రాండ్‌గా, ఇంటెన్స్‌గా ప్లాన్ చేస్తున్నారట. 'దసరా' కాంబో మళ్ళీ రిపీట్ అవుతుండటం, అందులోనూ ఈ పాట థియేటర్లలో ప్రేక్షకులకు మైండ్ బ్లాకింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా తెరకెక్కిస్తుండటంతో ఈ మాస్ నంబర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.



# 'ఎల్లమ్మ' నుండి సాలిడ్ అప్డేట్..

'బలగం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత దర్శకుడు వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న లేటెస్ట్ చిత్రం 'ఎల్లమ్మ'. గ్రామీణ నేపథ్యంలో యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో దేవిశ్రీ ప్రసాద్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. దీంతో ఈ సినిమాప ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ అయ్యాయి. కాగా, ఆగస్టు 2న దేవిశ్రీ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను చిత్రబృందం విడుదల చేయనుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రమోషనల్ అప్‌డేట్‌ను నిర్మాణ సంస్థ టీజ్ చేయడంతో ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనేది ఇప్పటివరకు మేకర్స్ వెల్లడించలేదు. హీరోగా నటిస్తూనే ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వయంగా స్వరాలు అందిస్తున్నాడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




# సెల్ఫీలు ఇవ్వలేను క్షమించండి!

సినీతారలు బయట కనిపిస్తే జనాలు ఫొటోల కోసం ఎగబడటం సర్వసాధారణం. ఈ విషయంలో కొందరు హీరోయిన్లు సహకరిస్తే, మరికొందరు పట్టించుకోకుండా వెళ్లిపోతుంటారు. ఇంకొందరైతే జనాలపై కోపాన్ని ప్రదర్శిస్తుంటారు. తాజాగా ప్రియాంక చోప్రాకు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ముంబై ఏయిర్‌పోర్ట్‌లో తన కుమార్తెను ఎత్తుకుని సడెన్ ఎంట్రీ ఇచ్చారు ప్రియాంక చోప్రా. ఒక్కసారిగా ప్రియాంకను చూడగానే సెల్ఫీల కోసం జనం ఎగబడ్డారు. కానీ వారిపై ప్రియాంక కోపగించుకోలేదు. అందుకని సెల్ఫీలు కూడా ఇవ్వలేదు. ఒక్కక్షణం అగి.. 'నేను నా పాపతో ఉన్నాను. ఇప్పుడు సెల్ఫీలు ఇవ్వలేను.. క్షమించండి' అని చిరునవ్వుతో మర్యాదగా జనానికి నచ్చజెప్పి, అక్కడ్నుంచి చరచరా వెళ్లిపోయింది. ఈ విషయంలో ప్రియాంక ప్రవర్తన అక్కడున్న వారందరికీ బాగా నచ్చింది. అంతర్జాతీయంగా కీర్తి గడించి కూడా ఇంత ఒదిగి ఉండటం సామాన్యమైన విషయం కాదంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



Printed & Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com